ప్రజాశక్తి

ఆదివారం 13 ఏప్రిల్ 2025

5

అల్లూరి సీతారామరాజు

ఈ - శ్రమ్ నమోదుతో లబ్ధి

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈశ్రమ్ పోర్టల్ ద్వారా ఉచిత నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఎంపిడిఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా ప్రతి కార్మికుడు ప్రధాని సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద బీమా పొందే అర్హత కలిగినవారవుతారన్నారు. వలస కార్మికులను గుర్తించేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పథకానికి 16 నుండి 59 సంవత్సరాల వయస్సు కలిగినవారు, ఆదాయపు పన్ను చెల్లించని వారు, ఈపీఎఫ్ మరియు ఈఎస్ఐ లాంటి సదుపాయాలు లేని అసంఘటిత రంగ కార్మికులు అర్హులని వివరించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, భవన కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, మిడ్ డే మీల్ వర్కర్లు, విద్యా వాలంటీర్లు, హమాలీలు మొదలైనవారు ఇందులో చేరవచ్చని చెప్పారు.

సత్తాచాటిన గిరి విద్యార్థులు

-ప్రథమ ఇంటర్‌లో 50.21, ద్వితీయలో 67. 84 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ ఉత్తీర్ణత 67.84 శాతం వచ్చింది. జిల్లాలోని పాడేరు రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఉన్న 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 2883 మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరుకాగా 1956 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ కళాశాల నుంచి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 3097 మంది విద్యార్థులు హాజరు కాగా 1553 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఈ మేరకు జిల్లాలో మొదటి సంవత్సరం ఇంటర్ ఉత్తీర్ణత 50.21 శాతం నమోదు కాగా ద్వితీయ సంవత్సరం 67. 84 శాతం ఉత్తీర్ణత వచ్చింది. అల్లూరి జిల్లాలో అత్యధికంగా పాడేరు డివిజన్ పరిధిలో ఉన్న ముంచంగిపుట్ జూనియర్ కళాశాలలో 95శాతం ఇంటర్ ఉత్తీర్ణత వచ్చింది. ఈ కళాశాలలో 222 మంది పరీక్షకు హాజరు కాగా 210 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 177 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 165 మంది ఉత్తీర్ణులయ్యారు 93 శాతం ఉత్తీర్ణత లభించింది. హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 216 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 187 మంది ఉత్తీర్ణులయ్యారు. 86.57 శాతం ఉత్తీర్ణత లభించింది.

ప్రతిభ కనబరిచిన హరిచందన

రంపచోడవరం డివిజన్‌లోని వీఆర్పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దీంతో జిల్లాలో ఈ కళాశాలలో అత్యల్పంగా ఇంటర్ ఉత్తీర్ణత 22.58 శాతం వచ్చింది. జిల్లాలోని 4 కళాశాలలో 70 శాతం దాటి ఇంటర్ ఉత్తీర్ణత వచ్చింది. సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో77.77 శాతం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 76.28 శాతం కూనవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 75 శాతం అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 73.07 శాతం ఇంటర్ ఉత్తీర్ణత వచ్చింది మరో మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 60 శాతం పైగా ఉత్తీర్ణత నమోదయింది...

గురుకులాల్లో 92.4శాతం ఇంటర్ ఉత్తీర్ణత...

అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలో ఉన్న 8 గురుకులాలు మరియు ఒక స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్స్ కళాశాలల్లో మొదటి సంవత్సరం మొత్తం 1274 మందికి గాను 1046 మంది ఉత్తీర్ణత సాధించగా 228 మంది ఫెయిలయ్యారు. 82. 1 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం లో 1317 మందికి గాను 1217 మంది ఉత్తీర్ణులయ్యారు వందమంది ఫెయిలయ్యారు. 92.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఈ గురుకుల కళాశాలల్లో 621 మంది బాలురు 596 మంది బాలికలు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించారు. గురుకులాల్లో గత ఏడాది 91.7శాతం ఉత్తీర్ణత రాగా ఈ ఏడాది స్వల్పంగా 0.7 శాతం ఉత్తీర్ణత పెరిగింది.

మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం పందిరి మామిడి కోట గ్రామానికి చెందిన పివిటిజి గిరిజన బాలిక కదల హరిచందన సాయి ప్రియ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 981 మార్కులు సాధించి సత్తాచాటింది. 4 సబ్జెక్టుల్లో 100కి 100శాతం మార్కులు సాధించి 98.1శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకుంది. పదో తరగతి వరకు రంపచోడవరం ఏపీఆర్ స్కూల్ చదువుకున్న హరిచందన టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించింది. అనంతరం వై.రామవరం మండలం పి.ఎర్రగొండ ఏపీఆర్ కాలేజీలో ఇంటర్‌లో చేరిన ఆమె ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 981 మార్కులతో జిల్లాలో టాప్‌లో నిలిచింది. హరి చందన ప్రతిభ పట్ల తల్లిదండ్రులు కదల నారాయణరెడ్డి, వెంకటలక్ష్మి ఆనందనం వ్యక్తం చేశారు. బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

రంపచోడవరం నిధులు వేరే నియోజకవర్గాలకు తరలింపు

- గిరిజనుల పట్ల ప్రభుత్వం, అధికారుల వివక్ష సరికాదు
- నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే వైఫల్యం
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ

మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన ఎస్ఆర్‌జిఎస్ మెటీరియల్ కాంపోనెంట్ 40 శాతం నిధులను ప్రభుత్వం వేరే నియోజకవర్గాలకు తరలించి, రంపచోడవరం ఏజెన్సీకి తీవ్రమైన ద్రోహం చేస్తుందని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే మీద కక్షతో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రంపచోడవరం ఏజెన్సీకి ఖర్చు పెట్టకుండా వేరే ప్రాంతానికి, వేరే నియోజకవర్గానికి జిల్లా కలెక్టర్, పిడి ఖర్చు పెడుతున్నారని, దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఉపాధి హామీ ద్వారా ప్రతి మనిషికి వంద రోజుల పని దినాలు కల్పించాలని చట్టం చెబుతుంటే, కూలీలు పనిచేసిన దానికి వచ్చిన ఆదాయం నుండి 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద సిసి రోడ్డు, బిల్డింగ్స్ ఇతర అభివృద్ధి పనులకు మళ్లించడం దారుణమన్నారు. ఆ డబ్బులు రంపచోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కాకుండా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, పిడి వేరే నియోజకవర్గాలకు తరలించి, గిరిజనుల పట్ల వివక్ష, నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. అధికారులతో కొట్లాడి నిధులు తీసుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే వైఫల్యం చెందారన్నారు. స్థానిక మండలాలను యూనిట్‌గా ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాల్సి ఉండగా, 40 శాతం మెటీరియల్ నిధులను జిల్లా యంత్రాంగం పక్కదారి పట్టించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఈ నియోజకవర్గానికి రావాల్సిన నిధుల రాబట్టి దాని కోసం కృషి చేయాలని వాణిశ్రీ డిమాండ్ చేశారు. రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న పీహెచ్ అతిథి గృహాన్ని కావాలనే డిఎల్‌డిఓ కార్యాలయానికి కేటాయించారన్నారు. ఇన్ని రోజులు అతిథి గృహం వేరే వాళ్ళ చేతిలో ఉన్నా పట్టించుకోని ప్రభుత్వ అధికారులు స్థానిక ఎమ్మెల్యేగా పరిపాలన సౌలభ్యం కోసం దానిని తనకు కేటాయించాలని కోరగానే దానిని తక్షణమే డిఎల్‌డిఓకు ఏలా కేటాయిస్తారని, ఇదంతా ఎమ్మెల్యే మీద కక్షతోనే చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి అధికార యంత్రాంగం సహకరించాలని వాణిశ్రీ కోరారు.

ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

విధులకు వైద్యులు డుమ్మా

-ప్రతి శనివారం ఇదే తంతు
-అవస్థలు పడుతున్న రోగులు

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యులు విధులుకు డుమ్మా కొట్టారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు ఉన్నారు. రెండవ శనివారం కావడంతో ఉదయం 10గంటల నుంకి 12గంటల వరకు ఇద్దరు వైద్యులు ఒపిలో ఉండాలి. 11గంటల సమయంలో ఆసుపత్రికి పాత్రికేయులు వెళ్లగా ఇద్దరు వైద్యులు కూడా లేరు. ఇద్దరు వైద్యాధికారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

హుకుంపేట వారసంతకు శనివారం రోగులు వస్తుంటారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించే ఇద్దరు వైద్యాధికారులు లేకపోవడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలి అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 సచివాలయాల పరిధిలో 37,900 జనాభా కలిగి ఉన్నారు. నిత్యం రోగులతో అత్యవసరం కేసులు నమోదు అవుతుంటాయి. రెండో శనివారం వస్తే చాలు ఇద్దరు వైద్యులు కూడా అందుబాటులో ఉండరని రోగులు ఆరోపిస్తున్నారు. విధులకు డుమ్మా కొడుతున్న వైద్యాధికారులపై చర్యలు తీసుకొని సామాన్య ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయంపై జిల్లా ఎడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ తుడుము ప్రతాప్‌ను వివరణ కోరగా...ఇద్దరు వైద్యులలో ఒక్కరైనా కచ్చితంగా విధులకు హాజరు కావాలి. వైద్యాధికారులు సమయం పాలనా తప్పనిసరిగా పాటించాలి. విధులకు రాకుంటే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉత్సాహంగా బడ్డు ఉత్సవం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో సంప్రదాయ బద్ధంగా వస్తోన్న బడ్డులాగే సంస్కతిలో గిరిజనులు సందడి చేశారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణ పరిధిలో పాత పాడేరు చావడి వద్ద శనివారం సాయంత్రం బడ్డులాగే క్రతువు ఘనంగా జరిగింది. పాత పాడేరులో ప్రతి ఏడాది చైత్రమాసంలో ఇటుకల పండుగను విభిన్నంగా ఆచరిస్తుంటారు. ఇందులో భాగంగా సేకరించిన తీగలతో తాడులా పెద్ద బడ్డును తయారుచేసి, దానికి మహిళలు పూజలు చేస్తారు. ప్రతి ఏటా ఇటుకల పండుగను పురస్కరించుకుని గ్రామంలో గ్రామస్తులంతా మహిళలు, పురుషులు వేరువేరు రోజుల్లో కలిసి బడ్డు లాగే ఆచారం ఎప్పటినుంచో వస్తోంది. ఈ క్రమంలో అక్కా చెల్లెలైన మహిళలు ఒకవైపు, వదినా మరదళ్ల మరోవైపు ఉంటూ ఆ బడ్డును లాగుతారు. అది ఎవరి వైపునకు లాకుంటే వాళ్లే విజయం సాధించినట్టుగా భావిస్తారు. ఈ సందర్భంగా మహిళలంతా దింసా నృత్యాలతో సందడి చేశారు. పురుషులంతా పెద్ద ఎత్తున గ్రామ చావడికి చేరుకుని బడ్డును లాగారు ఇందులో అన్నదమ్ములు బావమర్దులు వేరువేరు వర్గాలుగా విడిపోయి బడ్డును లాగారు ఇరువర్గాల మధ్య హెూరాహెూరీగా ఈ పోటీ సాగింది. విభిన్నమైన ఈ సంబరాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్రామ పెద్దలు, చిన్నలు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

బడ్డు లాగుతున్న అన్నదమ్ములు, బావమర్దులు

గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హిమబిందు

విధిగా ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలి

ప్రజాశక్తి -సీలేరు : గర్భిణులు విధిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలలు వైద్యుల సూచన మేరకు చింతపల్లి ఏరియా హాస్పిటల్‌కి వెళ్లి స్కానింగ్ చేయించుకోవాలన్నారు. స్కానింగ్ చేయించుకోవడం వల్ల ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించవచ్చునని చెప్పారు. గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. పురిటినొప్పులు ప్రారంభమైన తరువాత ఆస్పత్రికి తరలించడం కంటే గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా ఆస్పత్రిలో చేరాలని సూచించారు. చింతపల్లి, గూడెం కొత్త వీధిలో గర్భిణుల వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ వసతి గృహాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సహాయకులకు కూడా భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి గర్భిణి వసతి గృహం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గొర్రెలమెట్ట పాఠశాల పైకప్పు రేకులు ఎగిరిపోయిన దృశ్యం

ఏజెన్సీలో ఈదురుగాలులతో వర్షం

ఎగిరిపోయిన గొర్రెలమెట్ట పాఠశాల పైకప్పు రేకులు

ప్రజాశక్తి-కొయ్యూరు : జిల్లాలోని కొయ్యూరు, జికె.వీధి మండలాల్లో శనివారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఈదురుగాలుల కారణంగా కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయితీ పరిధి గొర్రెలమెట్ట గ్రామంలో ఎంపీపీ పాఠశాల భవనం పైకప్పు రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని బూదరాళ్ల పంచాయితీ సర్పంచి సాగిన ముత్యాలమ్మ, వార్డ్ సభ్యులు సంజీవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో వైపు తీవ్రమైన ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షంతో కొంత ఉపశమనం కలిగింది.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఉరుములతో కూడిన వర్షం శనివారం రాత్రి కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. ప్రజలు ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో నానా అగచాట్లుకు గురయ్యారు. సాయంత్రం 6 గంటల సమయంలో సీలేరు పరిసర ప్రాంతాల్లో మేఘావృతమై వర్షం కురవడంతో చల్లటి గాళ్లు వీచాయి. వర్షం కారణంగా వాతావరణం చల్లబడంతో ఉదయం నుంచి ఇబ్బందులకు గురైన ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సీలేరులో కురుస్తున్న వర్షం

సమస్యలను తెలుసుకుంటున్న గంగరాజు

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి: మద్దిగరువు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని జెడ్పిటిసి డి. గంగరాజు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. శనివారం మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి మద్దిగరువు గ్రామంలో సమస్యలు తెలుసుకునేందుకు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రస్తుతం వేసవికాలం కావడంతో కొండవాగుపై ఉన్న ఊట అట్టడుగు ఇంకిపోయిందని, దీనితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ఊట వర్షాకాలంలోనే నీరు ఊరుతుందని, వేసవికాలం అయితే పూర్తిగా ఇంకిపోతుందని తెలిపారు.తక్షణమే గ్రామంలో బోరు లేదా పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయాలని కోరారు. పైపులైన్ ఊట వద్ద నిర్మించారని, వేసవికాలం కావడంతో తాగునీరు సరఫరా నిలిచి పోయిందని తక్షణమే ప్రభుత్వం శాశ్వత పరిష్కారం మార్గం చెప్పటాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్ నాగులు, ఉప సర్పంచ్ పి. అర్జున్, పీసా కమిటీ సభ్యులు ఎస్.ఆనంద్. గ్రామస్తులు దామోదర్, సుబ్బారావు, ధర్మనాయుడు. మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

-గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు శనివారం మండలానికి మారుమూల పిన్నకోట, పెద్దకోట, జీనబాడు. పంచాయతీ పరిధి గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మారుమూల గ్రామాలలో నెలకొన్న మౌలిక వసతి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు కోట్ల రూపాయల నిధులు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు టి బుజ్జి బాబు, అప్పారావు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు నేత కుంజా బొజ్జి

-సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్
-ఘనంగా 4వ వర్థంతి వేడుకలు

బొజ్జి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కిరణ్, వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే అమరజీవి కుంజా బొజ్జి ఆదర్శ కమ్యూనిస్టు నేత అని, ఆయనను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. కుంజా బొజ్జి 4వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ముందుగా బొజ్జి చిత్ర పటానికి బొప్పెన కిరణ్, పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ విఆర్.పురం మండలం అడవి వెంకన్నగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన బొజ్జి భద్రాచలం ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచి నిస్వార్థంగా ప్రజలకు సేవలు చేశారని కొనియాడారు. ఎక్కడ ప్రజలకు చిన్న కష్టం ఉందని తెలిసినా వెంటనే వారిని ఆదుకునే వారని చెప్పారు. మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కుంజా బొజ్జి లాంటి నాయకులను నేటి తరం కార్యకర్తలకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బొజ్జి స్ఫూర్తితో గిరిజన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లి రెడ్డి, వేణి, కృష్ణ, కరుణాకర్ పాల్గొన్నారు.

విఆర్.పురం : అమరజీవి కామ్రేడ్ కుంజా బొజ్జి 4వ వర్ధంతి ఆయన స్వగ్రామం రామవరం పంచాయతీ పరిధి అడవివెంకన్న గూడెం గ్రామంలో శనివారం జరిగింది. ముందుగా బొజ్జి స్థూపం వద్ద పార్టీ సీనియర్ నాయకులు కుంజా నాగిరెడ్డి జెండా ఆవిష్కరణ చేశార. బొజ్జి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా బొజ్జి అసెంబ్లీలో ఏజెన్సీ ప్రజల గొంతుకు వినిపించిన మహానాయకుడని తెలిపారు. సోకులేరు బ్రిడ్జి, మారుమూల ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం, రహదారులు, పాఠశాలు, హాస్టళ్లు, ఆసుపత్రులు ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పోడియం శ్రీరామ్మూర్తి, వడ్లది రమేష్, సిరపు తాతబాబు, కె.నాగరాజు, సుధీర్, భద్రయ్య, శేఖర్, ఉర్మ. ముత్యాలు, బొజ్జి మనవడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడవివెంకన్న గూడెంలో బొజ్జి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతూరు సిపిఎం కార్యాలయంలో...

కూనవరం : కుంజా బొజ్జి 4వ వర్ధంతి సభ స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. బొజ్జి చిత్ర పటానికి గడ్డిపాటి షణ్ముకేశ్వరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన హక్కులు, పోడు భూములు కోసం, 1/70చట్టం కోసం ఆయన అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట పటిమను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, యూసుఫ్, కొండా ఈశ్వర్లు, సుధా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో కుంజా బుజ్జి 4వ వర్ధంతి సభ పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్ అధ్యక్షతన జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు బొజ్జి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐవి మాట్లాడుతూ నిస్వార్థం, నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవ, త్యాగం వంటి వాటికి బొజ్జి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలను గుర్తు చేసుకొని భవిష్యత్తులో ఆయన స్ఫూర్తితో సిపిఎం విస్తరణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.మాధవరావు, ఐ.పద్మ, జి.హుస్సేన్, జి.హరి, సవలం రాము, బి.స్టాలిన్, నరేష్ పాల్గొన్నారు.

చింతూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఆదివాసీల హక్కుల ఉల్లంఘనలపై ప్రజా పోరాటాలు నిర్వహించడమే కామ్రేడ్ కుంజా బొజ్జికి నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బొజ్జి నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పార్టీ సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మోటుం రాజయ్య, వేక రాజకుమార్, పట్రా రమేష్, వేక గోవింద్, తెపల్ల లక్ష్మయ్య, పాండ్రు నాగార్జున, బి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక సిపిఎం కార్యాలయంలో...

కూనవరం సిపిఎం కార్యాలయంలో...

పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానం చేయాలి

యుటిఎఫ్ నేతల వినతి

విద్యా కమిటీలకు వినతిపత్రాలు ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా పంచాయతీ సర్పంచ్, పాఠశాల విద్యా కమిటీలకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందని అల్లూరి జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పుడిగి. దేముడు, మండల యూటిఎఫ్ సహా అధ్యక్షులు సోమల గంగరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు బిడ్డ. సింహాచలం తెలిపారు. ఈ మేరకు పంచాయతీ గ్రామసభలో తీర్మానం చేయాలని శనివారం.టోకూరు సర్పంచ్ కిల్లో మోసియాకు వినతి పత్రాన్ని లిఖితపూర్వకంగా అందజేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లకు విన్నవించడం జరుగుతుందన్నారు. ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టిఉపాధ్యాయులను నియమించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి .దేవన్న, యుటిఎఫ్ మండల నాయకులు జె.దేముడు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

గంజాయి నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతి లబ్బూరు జంక్షన్ వద్ద గంజాయి తరలిస్తున్నారని సమాచారంతో బైక్ ఆపి తనిఖీ నిర్వహించగా 10 కేజీల గంజాయి పోలీసులు గుర్తించారు. గంజాయితో పాటు రెండు ఫోన్లు, గ్లామర్ బైక్‌ని స్వాధీనం నిందితులైన హేమంతనాయక్, బైలోచన్ నాయక్‌లను అరెస్టు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం లబ్బూరూ జంక్షన్ వద్ద గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్నామన్నారు.అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారికి చట్టరీత్యా శిక్ష తప్పదన్నారు.ఈ తనిఖీల్లో ఏఎస్ఐ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి- పాడేరు : భారత రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ జయంతి మహోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జనార్దన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలంకరణ, పబ్లిక్ మీటింగు ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని ఈ మేరకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యమై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటర్‌లో మెరిసిన గిరిజన విద్యార్థులు

గుబ్బాయి వెంకటలక్ష్మి, బీమిడి పూర్ణదేవి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం లోతేరు పంచాయితీ మారుమూల బొర్రకలవలస, కురిసేల గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు బీమిడి పూర్ణదేవి, గుబ్బాయి వెంకటలక్ష్మి శనివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విజయనగరం జిల్లా ఎస్.కోట వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపిహెచ్ డబ్ల్యు రెండవ సంవత్సరం ఉత్తీర్ణత సాధించింది.ఎంపిహెచ్ డబ్ల్యు గ్రూపులో 914/1000 మార్కులు సాధించి ప్రతిభను కనబరిచింది. విజయనగరం జిల్లా ఎస్ కోటలో వరలక్ష్మి కళాశాలలో గుబ్బాయి వెంకట్ లక్ష్మి ఇంటర్ రెండోవ సంవత్సరం చదువుతూ ఆమె కూడా 863/1000 ఉత్తీర్ణత సాధించింది.

సత్తాచాటిన ఎపిఆర్‌జెసి విద్యార్థినులు

పి గీతానవ్యశ్రీ (964) 04 ఎం సునీత (485)

రంపచోడవరం :శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రంపచోడవరం ఎపి రెసిడెన్షియల్ బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 177 మంది హాజరు కాగా 166 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. 91 శాతంగా నమోదైంది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 192 మంది హాజరుకాగా 178 మంది ఉత్తీర్ణులై 93శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.గీత నవ్యశ్రీ 964 మార్కులు, ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎం.సునీత 485 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు.

ప్రభుత్వ జూరియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కె.సౌజన్య కె.రాధ పి.పావని సంకీర్తన

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 46 మంది హాజరు కాగా, 37 మంది ఉత్తీర్ణులై 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 45 మంది హాజరు కాగా, 35 మంది ఉత్తీర్ణులై 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్రావు వెల్లడించారు. ప్రథమ ఇంటర్‌లో కె.సౌజన్య 416 మార్కులు సాధించి మొదటి స్థానంలోనూ, కె.రాధ 405 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ద్వితీయ ఇంటర్‌లో పి.పావని 978 మార్కులతో ప్రథమ స్థానంలోనూ, సంకీర్తన 770 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. పరీక్షలు తప్పిన విద్యార్థులు మేలో జరిగే సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షలకు ఏప్రిల్ 22 లోపు ఫీజు చెల్లించాలని సూచించారు.

ప్రతిభ చూపిన జుబేదా

జుబేదా

సీలేరు : జీకే వీధి మండలం సీలేరుకు చెందిన ఎస్కే జుబేదా ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో 464/470 మార్కులు సాధించి విశాఖలోని శ్రీచైతన్య కళాశాలలో తృతీయ స్థానంలో నిలిచింది. జుబేదా సీలేరు డిఎవి పాఠశాలలో చదివిన జుబేదా గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 554 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని పొందింది. విశాఖపట్నం శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ చదువుతున్న జుబేదా ఎంపీసీ గ్రూపులో 464 మార్కులు సాధించి అక్కడ కళాశాలలో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సీలేరు డిఎవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, తండ్రి ఎస్కే బాబ్జి తల్లి ఎస్కె బీబీ జాన్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

గురుకులంలో..

ఎం వీరభవాని వై త్రిష రమాదేవి ఎల్ దేవి మౌనిక.

రాజవొమ్మంగి : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక గురుకుల కళాశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇంటర్ బైపీసీ విద్యార్థిని ఎం.వీరభవాని 909/1000 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, వై.త్రిష రమాదేవి బైపీసీలో 900 మార్కులతో ద్వితీయ స్థానం, ఎల్.దేవి మౌనిక హెచ్‌ఈసీలో 807 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. గురుకుల కళాశాల నుండి ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 126 మంది హాజరుకాగా, 97 మంది ఉతీర్ణులై 77శాతం నమోదైంది. ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలు 132 మంది రాయగా, 77 మంది పాసై 58 శాతం ఉత్తీర్ణులయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్‌లో 122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 61 మంది పాసై 61 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ ఇంటర్ పరీక్షలు 139 మంది రాయగా, 69 మంది పాసై 50శాతం ఉత్తీర్ణులైయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లోని బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ ఇంటర్లో 12 మంది పరీక్ష రాయిగా ఆరుగురు ఉత్తీర్ణులై 50శాతం, ద్వితీయ ఇంటర్లో ముగ్గురు విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు ఉత్తీర్ణులే 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో శతశాతం మంది ఉత్తీర్ణులు కాగా, ప్రథమ సంవత్సరంలో 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 37 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 37 మంది ఉత్తీర్ణులు అవ్వగా వి మౌనా కుమారి అనే విద్యార్థిని 1000 మార్కులకు గాను 873 మార్కులతో టాపర్‌గా నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 38 మంది విద్యార్థులకు 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వగా వంతల మౌనిక అనే విద్యార్థిని 470 మార్కులకు గాను 373 మార్కులతో ఎంపీసీ గ్రూప్ లో టాపర్‌గా నిలిచారు

బి.నందిని

హుకుంపేట:మండలంలోని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కాలేజీ ఫస్ట్ ర్యాంకు సాధించిన బి నందిని 420 మార్కులు సాధించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలిక కళాశాలలో బైపిసి విద్యాభ్యసిస్తుంది.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలురు 213 మందిలో 140 మంది ఉత్తీర్ణత పొందారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలలో 300 మంది విద్యార్థినిలు 270 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభచూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

గంగవరం కెజిబివిలో..

అరుణకుమారి

గంగవరం : ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 87 శాతం ఉత్తీర్ణత సాధించింది. ద్వితీయ పరీక్షలకు 31 మంది విద్యార్థినులు హాజరు కాగా 27, మంది 87శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కాలేజ్ ప్రిన్సిపల్ కే పద్మావతి తెలిపారు. ప్రథమ ఇంటర్ పరీక్షలకు 24 మంది హాజరు కాగా 11 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న అరుణకుమారి 826 మార్కులు సాధించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకటలక్ష్మి, కే.భారతి పాల్గొన్నారు.

కెజిబివిలో 98 శాతం ఉత్తీర్ణత

భీమునిపట్నం :స్థానిక కెజిబివిలో ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ గంగాకుమారి శనివారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సెకెండియర్‌లో 35 మంది విద్యార్థులు పరీక్షకు హజరుకాగా, 34 మంది ఉత్తీర్ణులై, 98 శాతం ఫలితాలను సాధించారన్నారు. ఆరుగురు విద్యార్థులకు 900 పైబడి మార్కులు రాగా,బి వెంకటలక్ష్మి 967, జి.జ్యోత్న్న 954, బి నేహ 935 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో 33 మంది విద్యార్థులకు గాను 26 మంది ఉత్తీర్ణులై, 78 శాతం ఫలితాలను సాధించారన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 79 శాతం ఉత్తీర్ణత

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ పి రామ్‌ప్రసాద్ శని వారం తెలిపారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్ గ్రూపుల నుంచి 112 మంది, వృత్తి విద్యా కోర్సుల నుంచి 185 మంది మొత్తంగా 297 మంది పరీక్ష రాయగా, వారిలో 234 మంది (79 శాతం)ఉత్తీర్ణులయ్యారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నర్సింగరావు తదితరులు

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మికులను బానిసలుగా చేసేటటువంటి లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న తలపెట్టిన అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో 'లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలి.. మే 20న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి' పేరిట వేసిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తోందని తెలిపారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాలు బేరమాడే హక్కును కోల్పోతారన్నారు. పనిగంటలు పెరుగుతాయన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, సామాజిక భద్రత వంటి అనేక హక్కులు కోల్పోతారన్నారు. అందుకే దేశంలో ఉన్నటువంటి కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఈ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. దీన్ని జయప్రదం చేయడం ద్వారా మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సమ్మె జయప్రదం కోసం విస్తారంగా కింద వరకూ కార్మిక వర్గంలోకి విషయాలను తీసుకువెళ్లేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు బి.జగన్, జి.అప్పలరాజు, పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కెఎం.కుమార మంగళం పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మంప గ్రామంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నుంచి గత పదిరోజులుగా సంకేతాలు వెలువడకపోవడంతో అక్కడి సెల్ వినియోగదారులంతా చాలా ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ఇదే పరిస్థితి నెలకొంటోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంకేతాల కోసం ఐదు కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వెళుతున్నారు. నెల వారీ ప్యాకేజీగా డబ్బులు వేసుకుంటున్నామని, సంకేతాల్లేకపోవడంతో అవి కాస్త వృధా అయిపోతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులకు తెలిపినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ సెల్ అధికారులు స్పందించి సంకేతాలు పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని సెల్ వినియోగదారులు కోరుతున్నారు.

గంగులయ్యను కలిసిన సుమంత్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పార్లమెంట్ ఇంచార్జి గంగులయ్యను పాడేరులోని ఆయన స్వగృహంలో పార్టీ మండల నాయకులు పరిశిక దుర్గా సుమంత్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుర్గా సుమంత్ రాజవొమ్మంగి జనసేన పార్టీ స్థితిగతులు, సభ్యత్వం, ప్రజా సమస్యలు వాటి గురించి వివరించారు. దీనికి స్పందించిన గంగులయ్య అందరు కలసికట్టుగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

ఉక్కులో తొలగింపు కుట్రలు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కూటమి' పాలకుల నోట్లో పచ్చివెలక్కాయ పడిందా ?. 'ఉక్కు'లో ఉద్వాసనలపై వారు ఎందుకు మాట్లాడడం లేదు ? 'ప్రైవేటీకరణ జరగనే జరగదు.. కార్మిక సంఘాలు అనవసరంగా కేంద్రంపై ఆరోపణలు చేస్తున్నాయి' అంటూ నొచ్చుకునే టిడిపి, జనసేన, బిజెపి నేతలు ఇప్పుడు ఎక్కడున్నారు ? రోజుకో తీరున స్టీల్ యాజమాన్యం కార్మికులను అవస్థలకు గురిచేస్తున్నా 'కూటమి' మౌనం దాల్చడం దేనికి ? విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ మొన్నటి ఎన్నికల్లో సాధించిన ఐదు లక్షల మెజారిటీలో స్టీల్ కార్మిక కుటుంబాలు లేవా ? గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు ప్లాంట్ రక్షణ కోసం చేపట్టిన దీక్షలు దొంగ దీక్షలేనా ? అధికారంలోకి వచ్చాక తొలి పోరాటం స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసమేనంటూ చెప్పిన మాటలేమయ్యాయి ?!. ఇలాంటి ప్రశ్నలన్నీ విశాఖ ప్రజలు, ఉక్కు కార్మికుల నుంచి వస్తున్నాయి. ఒకటా, రెండా ఏకంగా నాలుగేళ్లుగా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రైవేటీకరణను వ్యతిరేకించేందుకు ఆ పార్టీల నేతలెవరూ సాహసించడం లేదంటే పరిస్థితి ఎంతదాకా వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

తీవ్ర మనోవేదనలో కార్మికులు

స్టీల్ ప్లాంట్‌లో ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే కార్మికుల అడ్డగోలు తొలగింపునకు యాజమాన్యం కుట్రలు పన్నడం తాజాగా సర్వత్రా చర్చనీయాంశమైంది. కార్మికులు తమ జీవనోపాధి సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను సైతం పక్కనపెట్టి ప్లాంట్ రక్షణ కోసం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంగతి తెలిసిందే. తెల్లారి లేస్తే ప్లాంట్‌లో యాజమాన్యం ఏ కొత్త సమస్యను సృష్టించి అవస్థలకు గురిచేస్తుందోనన్న ఆందోళన, మానసిక వేదన ఉక్కు కార్మికులను నిరంతరం కలచివేస్తుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. కార్మికులను అడ్డగోలుగా తొలగించడం, ఉత్పత్తిని క్షీణింపజేసే చర్యలు, కాంట్రాక్టు కార్మికులను విధులకు రాకుండా అడ్డగించే యత్నాలు, ప్లాంట్‌లో విద్య, వైద్య సదుపాయాలపై వేటు వేసే చర్యలు ఇలా గడచిన నాలుగేళ్లుగా కేంద్రం ఆదేశాలతో స్టీల్ యాజమాన్యం చేస్తూనే ఉంది. వీటన్నిటినీ తట్టుకుని కార్మికులు నిలబడ్డారు. జీతాలు సకాలంలో అందకపోయినా ఉక్కు రక్షణే ధ్యేయంగా ముందుకు సాగడం నిజంగా చారిత్రాత్మకమైన విషయంగానే చూడాలి.

కాంట్రాక్టు కార్మికులపై వేటు

సుమారు 2500 మందికిపైగా కాంట్రాక్టు కార్మికులను స్టీల్ యాజమాన్యం ఈ కాలంలో తొలగించేసింది. గత నెలలో 1213 మంది పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్, ఉద్యోగ విరమణ పేరిట బయటకు పంపేసింది. కూటమి పాలన మొదలైన మూడు నెలలకే అంటే అక్టోబర్‌లోనే సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఒకేరోజు ఉద్వాసన పలికేందుకు కేంద్ర నిర్ణయంతో స్టీల్ యాజమాన్యం సిద్ధం కాగా కార్మికులంతా గట్టిగా పోరాడడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాంట్రాక్టు కార్మికులు ఉక్కు ఉత్పత్తిలో అత్యంత కీలకంగా ఏళ్లుగా పనిచేస్తున్నారు.

30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని తొలగించాలన్న నిర్ణయాన్ని యాజమాన్యం తీసుకోవడం కార్మికాగ్రహానికి కారణంగా ఉంది. వీరికి నోటీస్‌గానీ, ఉద్యోగ విరమణ సందర్భంగా ఒక్కరూపాయి కూడా ఇవ్వడానికి యాజమాన్యం సిద్ధంగా లేదు. కార్మికులను ఎలాగైనా బయటకు తోసేసే ప్రయత్నాల్లో ఉంది. కార్మికులు ఖాళీ అయిపోతే ఉత్పత్తి ఎవరు చేస్తారన్న ప్రశ్నకు కూటమి నేతల వద్ద సమాధానం దొరకడం లేదు. తొలగింపులను నిరసిస్తూ ఈ నెల 16 నుంచి కాంట్రాక్టు కార్మికులు స్టీల్‌ప్లాంట్‌లో నిరవధిక సమ్మెకు దిగుతున్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి రాక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం పేరుతో ఆదివారం ఉదయం 10:30 గంటలకు సాంస్కృతిక కళా ప్రదర్శన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) విశాఖ జిల్లా కమిటీలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. దీనికి ముఖ్య అతిథిగా సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి హాజరుకానున్నట్టు వెల్లడించాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మతతత్వ విధానాల వల్ల నేడు దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని, మహిళలకు, కార్మిక హక్కులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపాయి. కవులు కళాకారులు, ప్రశ్నించే వారిపై దాడులు జరుగుతున్న తరుణంలో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉద్ఘాటించాయి. ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఎల్ఐసి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి కళాకారుల ప్రదర్శన నిర్వహించి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక కళా ప్రదర్శన ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాన్ని చేపడతామని ఆయా కమిటీల నాయకులు టి.చిరంజీవి, ఎం.సుబ్బన్న, ఎం.చంటి, జి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

15 నుంచి చేపల వేట నిషేధం

మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తూర్పు తీర సముద్రంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు చేపల వేట నిషేధించబడిందని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్య సంపద పరిరక్షణ, పునరుత్పత్తి, నిర్వహణ దృష్ట్యా సముద్రంలో చేపల వేట నిషేధం అమలుచేస్తున్నట్టు పేర్కొన్నారు. మోటార్ ఇంజిన్ బోట్లు, మెకనైజ్డ్ బోట్లకు ఇది వర్తిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులందరూ ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

వేగా ఆభరణాల ప్రదర్శన ప్రారంభ కార్యక్రమానికి హాజరైన అతిథులు

వేగా బంగారు, వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బంగారు, వజ్రాభరణాల వ్యాపార సంస్థ వేగా జ్యూయలరీ విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా తమ వివాహ బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనను శనివారం ఉదయం బీచ్ రోడ్‌లోని ఐటిసి గ్రాండ్ పే హోటల్లో ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ మార్కెటింగ్ మేనేజర్ అశ్న ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతూ సోమవారం వరకూ నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో సాంప్రదాయ, వివాహ బంగారు వజ్రాభరణాలు పలు డిజైన్లలో లభిస్తాయన్నారు. విశాఖ నుంచి పలువురు కొనుగోలుదారులు తమకు ఆన్లైన్ ద్వారా ఆర్డర్లు పంపుతున్నారని, ఈ క్రమంలో వారికి మరింత చేరువయ్యేందుకుగాను ఈ ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం వేగా బిజినెస్ హెడ్ శ్రీనివాస్ మాట్లాడుతూ బంగారు ఆభరణాలపై మజూరీ ఛార్జీ లేకుండా, అన్ కట్ డైమండ్ ఆభరణాలపై మజూరీ, తరుగు లేకుండా, వజ్రాభరణాలపై ఒక క్యారెట్‌పై 25 శాతం తగ్గింపు ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ ప్రదర్శనలో పోల్కి, కందన్, విక్టోరియన్, జడావ్ వంటి డిజైన్‌లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో వేగా జ్యూయలర్స్ మేనేజర్లు గౌరీశంకర్, సత్య ప్రసాద్, బాలదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి - విఆర్.పురం : మార్కెట్ కమిటీ సభ్యులుగా ఇటీవల నియమితులైన విఆర్ పురం మండలానికి చెందిన ముత్యాల రామారావు, ఆచంట శ్రీనివాసరావులను శనివారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ శాలువాలు కప్పి డైరీలను అందజేసి సన్మానించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ ఎదుగుదలకు అహర్నిశలు శ్రమించి ఎన్నో పదవులను పొంది కూడా పార్టీ ఆదేశించిన మేరకు మార్కెట్ కమిటీ సభ్యులుగా ఎన్నిక కావడం చాలా సంతోషదాయకమన్నారు. రైతాంగానికి కార్మిక వర్గానికి అండదండలుగా వీరి పదవులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి బొర్రా నరేష్. ఐటిడిపి కన్వీనర్ ఎం.సిద్దు, బొర్రా నరసింహారావు, దేవస్థానం చైర్మన్ ఆదినారాయణ. శ్రీరామగిరి సుధాకర్, చంద్రశేఖర్, పి సుదర్శన్, మల్లికార్జునరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ ఎం శంకర్‌రావు, ఎం.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి దుక్కుటెద్దు మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం మారుమూల బూదరాళ్ల పంచాయతీ అన్నవరం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్‌కి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన తాంబేలు రమేష్ దుక్కిటెద్దు మృతి చెందింది. తనకు వ్యవసాయంలో తోడ్పాటు నిచ్చే ఎద్దు చనిపోవడంతో రైతు లబోదిబోమంటున్నాడు. గిరిజన రైతుకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు మెంబర్ సంజీవు విజ్ఞప్తి చేశారు. మూగజీవాలు విద్యుత్ ఘాతానికి బలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి చేతిలో మోసపోయిన వారికి న్యాయం చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) ప్రధాన కార్యదర్శి కోన గురువయ్య యాదవ్ కోరారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితులతో కలిసి ఆయన మాట్లాడుతూ అనంతలక్ష్మి, ఆమె భర్త వెంకటరావు కలిసి గాజువాక ప్రాంతంలో స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పార్టీ మహిళా నాయకురాలిగా ఉండి కొత్తూరు నరేంద్రను పోలీస్ స్టేషన్‌లో, పోలీసుల సమక్షంలో చెప్పుతో కొట్టడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మచ్చ లేదని చెప్పుకుంటున్న అనంతలక్ష్మి గాజువాకలో పలువురిని మోసగించిందని అన్నారు.